

20న విభిన్న ప్రతిభావంతుల జిల్లాస్థాయి క్రీడలు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం(డిసెంబరు 3న) సందర్భంగా జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల కేటగిరీల వారీగా ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు ఆ శాఖ ఏడీ కె.కవిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంలో కలెక్టర్ కార్యాలయం వద్ద డచ్ భవనం ఎదురుగా ఉన్న మైదానంలో ఈనెల 20న ఉదయం 10గంటల నుంచి ఆటల పోటీలు ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి గల విభిన్న ప్రతిభావంతులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

ఐటీడీఏకు జవసత్వాలు

- గిరిజనాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి
- బడ్జెట్‌లో నిధులు..
- గిరిజనుల్లో హర్షం



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

మెళియాపుట్టి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):

గిరిజనుల సంక్షేమం, ఆదివాసీల ఆర్థికాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇటీవల బడ్జెట్‌లో గిరిజన అభివృద్ధికి రూ.7,557 కోట్లు కేటాయించింది. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి సంబంధించిన సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది.

గిరిజనాభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు కేటాయించారు. గిరిజన సంక్షేమానికి రూ.7,557 కోట్లు, ట్రైకార్‌కు రూ.110 కోట్లు, మౌలిక వసతులకు రూ.125 కోట్లు, ఉచిత విద్యకు రూ.100కోట్లు, బోధన రుసుములకు రూ.128 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.41 కోట్లు, గిరిజన పరిశోధనకు రూ.28 కోట్లు, అంబేడ్కర్ విదేశీ విద్యకు రూ.10 కోట్లు, విద్యావసతి గృహాలకు రూ.42 కోట్లు, ఐటీడీఏ అత్యవసర నిధులు రూ.23.77 కోట్లు కేటాయించారు. జనాభా ప్రాతిపదికన కేటాయింపులు జరుగుతాయని అధికారులు తెలిపారు. సీతంపేట ఐటీడీఏకు అధికంగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు.

ట్రైకార్‌కు మంచి రోజులు..

గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు పెట్టుబడులు కింద సుమారు రూ.110 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గం చూపే అవకాశాలు ఉన్నాయి. చిన్న చిన్న వ్యాపారులుగానూ రాణించవచ్చు. గతంలో పూర్తిగా ఈ నిధులు దారి మళ్లించారు. దీంతో గిరినులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పు చేసి.. ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు.

ఐదేళ్లు వదిలేశారు..

వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో గిరిజన ప్రాంతాలు అధ్వానంగా మారాయి. సమస్యలపై ఎక్కడ నిలదీస్తారనే ఉద్దేశంతో ఐటీడీఏ పీవో సైతం గిరిజన దర్బార్ పెట్టేందుకు భయపడేవారు. గిరిజన దర్బార్‌లో అధికంగా ఆర్థిక పరమైన సమస్యలపై ఫిర్యాదు వచ్చేవి. కాగా.. నిధులు లేక అధికారులు ఆ సమస్యలు పరిష్కరించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఐటీడీఏకు నిధులు కేటాయించడంతో మళ్లీ గిరిజన దర్బార్‌కు అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. అలాగే గత వైసీపీ పాలనలో రద్దు చేసిన 18 రకాల పథకాలను పునరుద్ధరించేలా చర్యలు చేపడుతున్నారు. బడ్జెట్‌లో కూడా ఐటీడీఏకు అధికంగా నిధులు కేటాయించడంతో తమ ప్రాంతాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది..



మా పంచాయతీలో అధికంగా గిరిజన గ్రామాలు ఉన్నాయి. కానీ గత మూడేళ్లుగా ఐటీడీఏ నుంచి ఒక్కపైసా కూడా రాలేదు. పంచాయతీ నిధులు కూడా లేకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టలేకపోయాం. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించటం సంతోషంగా ఉంది.

- రవ్వల అనురాధ గణపతిరావు, సర్పంచ్, మర్రిపాడు-సి



ఢిల్లేశ్వరరావు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

రోదిస్తున్న మధుసూదనరావు భార్య సరస్వతి

చూస్తుండగానే..!

- ప్రమాదవశాత్తు బావిలో పడి ఇద్దరి మృతి
- పామును తీసేందుకు యత్నిస్తుండగా ఘటన
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు



మధుసూదనరావు(ఫైల్)



ఢిల్లేశ్వరరావు(ఫైల్)

పొందూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి వేడుకల అనంతరం ఆ ఇంట ఊహించని విషాదం నెలకొంది. ఓ పాము బావిలో పడగా.. దానిని బయటకు తీసేక్రమంలో మామ, మేనల్లుడు ప్రమాదవశాత్తూ మృతిచెందారు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పొందూరు మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన రఘుపతి మధుసూదనరావు(56), కింతలి ఢిల్లేశ్వరరావు.. శనివారం ఇంటి ఆవరణలో ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. మధుసూదనరావు ఇంట్లోకి శుక్రవారం రాత్రి ఓ పాము రాగా, దానిని చంపేందుకు యత్నించారు. దెబ్బ తగిలిన పాము ఇంటి ముందు ఉన్న నందల బావిలో పడిపోయింది. దీంతో శనివారం ఉదయం మధుసూదనరావు, ఆయన మేనల్లుడు ఢిల్లేశ్వరరావు.. ఆ పామును బయటకు తీసే ప్రయత్నం చేశారు. బావిలో నిండుగా ఉన్న నీటిని ఆయిల్ ఇంజన్‌తో తోడాలని నిర్ణయించారు. ఈ క్రమంలో నీరు తోడుతుండగా.. ఆయిల్ ఇంజన్ బావిలో పడిపోయింది. దానిని తీసేందుకు శనివారం ఉదయం 10గంటల సమయంలో మధుసూదనరావు బావిలో దిగాడు. ఎంత సేపయినా ఆయన బయటకు రాకపోవడంతో ఢిల్లేశ్వరరావు కూడా బావిలో దిగాడు. వారిద్దరూ బయటపడే మార్గం లేకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఆందోళన చెందారు. బావి మొత్తం ఇంజన్ ఆయిల్‌తో నిండి ఉండడంతో పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మొదట ఢిల్లేశ్వరరావును బయటకు తీశారు. తర్వాత మధుసూదనరావును బయటకు తీసేందుకు చాలా కష్టపడ్డారు. మధుసూదనరావు తలకు తీవ్రగాయమైనట్లు గుర్తించారు. అప్పటికే వారిద్దరూ మృతి చెందారని వెల్లడించారు. బావి మొత్తం ఆయిల్ కావడంతో బయటకు రాలేకపోయారని పోలీసులు తెలిపారు. సంఘటన (మిగతా 6వ పేజీలో..)

కలిసొచ్చిన ఖరీఫ్

- తొమ్మిది లక్షల మెట్రిక్‌టన్నుల లెవీ సేకరణకు అధికారుల నిర్ణయం
- జిల్లాలో 3,266 పంటకోత ప్రయోగాలు
- రబీ సీజన్‌లో ఆరు పంటలకు మాత్రమే బీమా సౌకర్యం

టెక్కలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రైతులకు ఖరీఫ్ కాలం కలిసొచ్చింది. జిల్లాలో కాలువలు, నదీతీరాలు, ఎత్తిపోతల పథకాలు, గెడ్డలు, వాగులు, చెరువుల కింద సాగునీటి కష్టాలను అధిగమించి నాలుగున్నర లక్షల ఎకరాలకుపైగా వరి సాగుచేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో జిల్లాలో తొమ్మిదిలక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్ అంతగా అనుకూలించకపోవడంతో కేవలం 5.45 లెవీ సేకరణకు పరిమితమయ్యారు. ఈ ఏడాది జిల్లాలో అత్యధిక వర్షపాతం ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలాల్లో నమోదు కాగా, టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి, పలాస, సారవకోట, జలుమూరు, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, మెళియాపుట్టి, పాతపట్నం, ఆమదాలవలస, రణస్థలం, లావేరు, కొత్తూరు, మందస, సోంపేట తదితర మండలాల పరిధిలో అనుకూలమైన వర్షాలు కురిశాయి. హిరమండలం, నరసన్నపేట, కవిటి, గార, పోలాకి, బూర్జ, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, జి.సిగడాం మండలాల్లో వర్షపాతం తగ్గింది. అయినా దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు వరికోతలు చేపడుతున్నారు.



కొత్తూరు మండలం ఒంద్రుజోలలో పంటకోత ప్రయోగాలు

● పంటకోత ప్రయోగాలు ఇలా..

జిల్లాలో ఈ ఏడాది 3,266 పంటకోత ప్రయోగాలు చేయాలని గణంకాధికారులు నిర్ణయించారు. ఐదుమీటర్ల పొడవు, వెడల్పు చొప్పున ప్రాంతాలను గుర్తించి పంటకోత ప్రయోగాలు చేయనున్నారు. శ్రీకాకుళం డివిజన్‌లో 1,324, టెక్కలి డివిజన్‌లో 1,046, పలాస డివిజన్‌లో 896 పంటకోత ప్రయోగాలు చేపట్టనున్నారు. ఇప్పటికే శ్రీకాకుళం డివిజన్‌లో 84, టెక్కలి డివిజన్‌లో 21, పలాస డివిజన్‌లో ఐదు పంటకోత ప్రయోగాలు పూర్తిచేశారు.

● రబీలో ఆరు పంటలకే బీమా..

ఈ ఏడాది రబీ సీజన్‌లో జిల్లాలో కేవలం ఆరు పంటలకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంతి ఫసల్‌బీమా యోజన కింద అవకాశం కల్పించాయి. వరి, వేరుశనగ, మొక్కజొన్న, రాగులు, మినుములు, పెసలు పంటలకు మాత్రమే ఆ అవకాశం లభించింది. ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఇందుకు సంబంధించి రైతులతో బీమా చేయించేందుకు సన్నద్ధమైంది. వరి ఎకరాకు రూ.42వేలు ధర నిర్ణయించి రైతు కానీ, కౌలురైతు కానీ రూ.630 బీమా సొమ్ము చెల్లించాలి. రాగులకు సంబంధించి ఎకరాకు రూ.240, వేరుశనగకు రూ.480, మొక్కజొన్నకు రూ.570, పెసలు, మినుములకు రూ.300 చొప్పున రైతులు ఇన్స్యూరెన్స్ కంపెనీకి ప్రీమియం చెల్లించాలి. మినుము, పెసలు, మొక్కజొన్న, వేరుశనగ, రాగులు పంటలకు డిసెంబరు 15లోగా ఇన్స్యూరెన్స్ చెల్లించాలి. వరికి మాత్రం.. (మిగతా 6వ పేజీలో..)

వారు పర్యావరణ ప్రేమికులు

- ప్లాస్టిక్ సంచుల రీ సైక్లింగ్
- వాటితో తాళ్ల తయారీ
- ఉద్దానంలోని ఆ ఊర్లకు ప్రత్యేక గుర్తింపు



6లో

సైబర్ నేరాల్లో గోల్డెన్ అవర్ కీలకం

7లో

- బ్యాంకుల వద్ద భద్రత పాటించాలి: ఎస్పీ మహేశ్వరరెడ్డి

వేరుశనగ విత్తనాల్లో డొల్ల

- రైతు సేవా కేంద్రాలకు నాసిరకం కాయలు
- ఆందోళన చెందుతున్న రైతులు



వేరుశనగ డొల్ల విత్తనాలు ఇలా..

నరసన్నపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రబీలో రైతులకు సబ్సిడీపై పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తనాల్లో డొల్లతనం బయటపడుతోంది. అధికశాతం డొల్ల కాయలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ పప్పు కూడా చేదుగా ఉండడంతో వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది నూనె గింజల సాగు పెంచాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ అధికారులు నువ్వులు, వేరుశనగ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రబీలో టెక్కలి, నరసన్నపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మండలాల్లో వేరుశనగ ఎక్కువగా సాగవుతోంది. 79,397 హెక్టార్లలో సాగు చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నరసన్నపేట, పోలాకి, నందిగాం, మెళియపుట్టి, పాతపట్నం తదితర మండలాల్లో ఎక్కువగా వేరుశనగ సాగు చేస్తారు. జిల్లాలో 6,543 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. అయితే నరసన్నపేట మండలం జమ్ము, తామరాపల్లి రైతు సేవా కేంద్రాలకు గత వారంలో 130.20క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. 30 కేజీల బస్తాలో సగానికిపైగా డొల్ల కాయలే ఉన్నాయని ఆయా గ్రామాల రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో విత్తనాలు చిరుచేదుగా ఉండటంతో మొలకపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వరి కోతలు సాగుతున్నాయి. మరో 15 రోజుల్లో వేరుశనగ వేసేందుకు రైతులు విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు. సబ్సిడీ విత్తనాల్లో నాణ్యత తక్కువగా ఉందని వారు చెబుతున్నారు. 100 గ్రాముల వేరుశనగ కాయలను పొట్టుతీస్తే 70 గ్రాముల పప్పు వస్తే మంచిది. అయితే రైతు సేవాకేంద్రాల్లో 30 కేజీల వేరుశనగ పొట్టు తీస్తే 15 కేజీల విత్తనాలు మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అంటే 50 శాతం మాత్రమే దిగుబడి వస్తున్నాయని, కొన్ని ఆర్ఎస్‌కేలకు పంపిణీ చేసే విత్తనాలు 60 గ్రాముల వరకు దిగుబడి వస్తున్నాయని చెబుతున్నారు. పుచ్చిన విత్తనాలు, డొల్ల విత్తనాలు ఎక్కువగా ఉన్నాయని వాపోతున్నారు.

30 కేజీల బస్తాకు 15కేజీల పప్పు

రైతు సేవాకేంద్రాల్లో పంపిణీ చేసే వేరుశనగ 30 కేజీల బస్తా తీసుకున్నాను. మిషన్ మీద కాకుండా చేతుల ద్వారా పొట్టు తీస్తే.. ఎక్కువగా డొల్ల కాయిలు ఉన్నాయి. వీటితోపాటు పుచ్చిన పప్పు కూడా ఎక్కువగా వచ్చింది. దిగుబడి 50 శాతమే అంటే 15 కేజీల పప్పు వచ్చింది. ప్రభుత్వం రాయితీ ఇచ్చినా ఏం ప్రయోజనం?

- కొత్తరెడ్డి బుసిమ్మ, జమ్ము

మొలకలపై అనుమానమే..

వేరుశనగ విత్తనాలు చిరుచేదుగా ఉన్నాయి. మొలకశాతం ఎలా ఉంటుందో పొలంలో వేస్తేగానీ తెలియదు. బస్తాల్లో డొల్లకాయలు ఎక్కువగా వస్తున్నాయి. మొలకలు రాకుంటే ఇబ్బంది పడతాం. ముందుగానే పరీక్షించి నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తే బాగుండేది.

- రెడ్డి శ్రీనివాసరావు, నరసన్నపేట

పరీక్షించి పంపిణీ చేశాం

రబీలో ఈ ఏడాది రాష్ట్రంలో ముందుగా జిల్లాలోనే సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశాము. సీడ్స్ కేంద్రంలో విత్తనాల నాణ్యత, మొలకశాతం పరీక్షించిన తర్వాత జిల్లాలకు పంపిణీ చేశారు. మార్కెట్‌లో కన్నా కిలోకు రూ.45 నుంచి రూ.50 తక్కువగా పంపిణీ చేస్తున్నాం. నాణ్యత తక్కువగా ఉంటే.. వాటి బదులు వేరే విత్తనాలు ఇస్తాం.

- కె.త్రినాథస్వామి, జేడీఏ



రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ(ఫైల్)



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మినీ అంగన్‌వాడీలు

మినీ సెంటర్లను.. ప్రధాన కేంద్రాలుగా మార్చాలి

- అంగన్‌వాడీల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా

అరసవల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు శనివారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అంగన్‌వాడీ మినీ సెంటర్లను ప్రధాన కేంద్రాలు మార్పు చేస్తూ జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు కె.కళ్యాణి, డి.సుధ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ బంగ్లా రోడ్డు కలెక్టరేట్ వరకు ర్యాలీ (మిగతా 6వ పేజీలో..)

వారు పర్యావరణ ప్రేమికులు


చిన్నఆమదాలపుట్టుగలో సిమెంట్ సంచుల దారాల నుంచి ప్లాస్టిక్ తాడును తయారు చేస్తున్న దంపతులు

- ప్లాస్టిక్ సంచుల రీ సైక్లింగ్
- వాటితో తాళ్ల తయారీ
- ఉద్దానంలోని ఆ ఊర్లకు ప్రత్యేక గుర్తింపు
- ప్రభుత్వం చేయూత అందించాలని విన్నపం

ఉద్దానంలోని నాలుగు గ్రామాల ప్రజలు పర్యావరణ ప్రేమికులుగా ముద్రపడ్డారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచులను రీ సైక్లింగ్ చేస్తున్నారు. వాటితో తాళ్లను తయారు చేస్తున్నారు. దీనిద్వారా ఒకపక్క ఉపాధి పొందుతూ.. మరోపక్క పర్యావరణాన్ని కాపాడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తమకు ప్రభుత్వం చేయూనిస్తే మరింత అభివృద్ధి చెందుతామని అంటున్నారు. వారి శ్రమైక జీవనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి)

కంచిలి మండలంలోని పెద్ద ఆమదాలపుట్టుగ, చిన్న ఆమదాలపుట్టుగ, కొక్కిలిపుట్టుగ, తలతంపర, కొన్నాయి పుట్టుగ తదితర గ్రామాల్లో ప్లాస్టిక్ సంచులతో తాళ్ల తయారు చేసే కుటీర పరిశ్రమలు ఉన్నాయి. ముఖ్యంగా పెద్ద ఆమదాలపుట్టుగ, చిన్న ఆమదాలపుట్టుగ, కొక్కిలిపుట్టుగలో సుమారు 60 నుంచి 70 కుటుంబాలకు గత 30 ఏళ్లుగా ఇదే జీవనాధారం. సిమెంట్ ప్లాస్టిక్ సంచుల నుంచి దారాలు తీసి, వాటితో వ్యవసాయ సంబంధ వస్తువులైన ఆవు దూడలకు వేసే కన్నెలు, ఉట్టిలు, తాడులు, కందాడులు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. గుణో సాహు, మురళీ సాహు, భగవాన్ సాహు, జగన్నాథ్ సాహు కుటుంబాలతోపాటు ఇతర కుటుంబాలు ఇదే వృత్తిని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. సోంపేట, పలాస, ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాలు చేసే చోట్లకు వెళ్లి ఖాళీ సిమెంట్ సంచులు సేకరిస్తారు. ఒక్కో సంచిని రూ.2నుంచి రూ.3కు కొనుగోలు చేసి తెస్తుంటారు. ఈ సంచులను మహిళలు గ్రామ సమీపంలో నీటితో శుభ్రం చేస్తారు. వాటి నుంచి ప్లాస్టిక్ దారాలను వేరు చేస్తారు. ఇలా చేసేందుకు ఒక్కో సంచికి రూపాయి నుంచి రూపాయిన్నర చెల్లిస్తారు. ఈ దారాలను చిన్న యంత్రం సహాయంతో ప్లాస్టిక్ తాడులుగా నేస్తారు. వాటితో కన్నెలు, ఉట్టిలు, తాడులు, కందాడులు తయారు చేస్తారు. ఈ తాళ్లను కంచిలి, కవిటి, మందస, పలాస తదితర మండలాల్లో జరిగే సంతలకు తరలించి విక్రయిస్తుంటారు. అలాగే ఒడిశా రాష్ట్రంలోని బరంపురం, ఛత్రపురం, చీకటిపేట తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. వాటి ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం తమకు కాస్త తోడ్పాటు అందిస్తే, ఆదాయాన్ని మరింత మెరుగుపరచుకునేందుకు వీలుంటుందని వారు అంటున్నారు.


చిన్నఆమదాలపుట్టుగ దారాలు సేకరించేందుకు నిల్వ ఉంచిన సిమెంట్ సంచులు

పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు..

విచక్షణారహితంగా మనం ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ సంచులు అటు నేలలో కలవక, వాతావరణంలో ఇమడక కాలుష్యానికి కారణమవున్నాయి. వాటిని కాల్చడం ద్వారా వచ్చే పొగ, ధూళితో వాయు కాలుష్యమవుతుంది. తీవ్ర దుర్గంధం వెదజల్లి, ఇబ్బందులు కలిగిస్తుంటాయి. ఇటువంటి హానికరమైన ప్లాస్టిక్‌తో వాతావరణానికి ఎటువంటి ముప్పు కలగకుండా, వాటిని రీ సైక్లింగ్ చేస్తూ తాము నిజమైన పర్యావరణ ప్రేమికులమని ఈ గ్రామాల ప్రజలు నిరూపిస్తున్నారు. పెద్ద ఆమదాలపుట్టుగకు చెందిన గుణో సాహు మాట్లాడుతూ.. 'నా తండ్రి, వారి స్నేహితులు కలసి ప్లాస్టిక్ సంచులను ఇలా వస్తువులుగా మార్చొచ్చు అని తెలుసుకుని గ్రామంలో మొదటగా మా ఇంటిలో ఈ కుటీర పరిశ్రమను ప్రారంభించారు. అది వివిధ గ్రామాలకు విస్తరించి ప్రస్తుతం 60 నుంచి 70 కుటుంబాలకు ఉపాధి అందిస్తుంది. ఇలా పర్యావరణ పరిరక్షణకు మా వంతు తోడ్పాటు అందించడం ఆనందంగా ఉందని' అన్నారు.

కొబ్బరి పీచుకు ప్రత్నామ్యాయంగా..

కొబ్బరి అంటే ఠక్కున గుర్తిచ్చే పేరు ఉద్దానం. కొబ్బరి కాయల వ్యాపారంతో పాటు కొబ్బరి పీచు, అనుబంధ వస్తువుల తయారీపై వందలాది కుటుంబాలు ఆధారపడేవి. అయితే, ప్రస్తుతం కొబ్బరి పంటకు తెగుళ్ల బెడద, అతివృష్టి, తుఫాన్ల కారణంగా తీవ్ర నష్టం ఏర్పడింది. ఈ క్రమంలో కొబ్బరి కాయ పరిమాణం తగ్గడం, నాణ్యత లోపించడంతో కొబ్బరి పీచు పరిశ్రమ, వస్తువుల తయారీపై దాని ప్రభావం పడింది. దీంతో కొబ్బరి తాళ్లు, ఇతరత్రా వస్తువులు తయారు చేస్తున్న కార్మికులు వేరే ఉపాధి మార్గాలను ఎంచుకున్నారు. ఈ క్రమంలోనే సిమెంట్ సంచుల నుంచి సేకరించిన ప్లాస్టిక్ దారాలతో తాళ్లను తయారీ చేసే విధానంపై కొంతమంది దృష్టి సారించారు. క్రమంగా కొబ్బరి పీచుతో తయారు చేసే వ్యవసాయ అనుబంధ వస్తువుల స్థానాన్ని ప్లాస్టిక్ తాళ్లు ఆక్రమించడంతో ఇది కుటీర పరిశ్రమ స్థాయికి చేరుకుంది. ఉద్దానం ప్రాంతంలో ప్లాస్టిక్ తాడుల తయారీ అంటే గుర్తేంచేంతగా పెద్ద ఆమదాలపుట్టుగ, చిన్న ఆమదాలపుట్టుగ గ్రామాలు పేరుపొందాయి. పక్కనే ఉన్న కొన్నాయిపుట్టుగ, కొక్కిలిపుట్టుగ, తలతంపరలో సైతం మహిళలు ఇప్పుడిప్పుడే ఈ ప్లాస్టిక్ తాడుల తయారీపై దృష్టిసారిస్తున్నారు. దీంతో కుటీర పరిశ్రమ వందల మందికి ఉపాధి కల్పించే స్థాయికి మారింది.

చేయూత అందిస్తే మరింత అభివృద్ధి..

చేతిలో ఉన్న కాస్త డబ్బులతో ప్లాస్టిక్ సంచులను కొనుగోలు చేసి, ఇంటిల్లాపాది రోజంతా కష్టపడితే అంతంత మాత్రంగానే ఆదాయం వస్తుందని ప్లాస్టిక్ తాళ్ల తయారు చేస్తున్న గుణో సాహు, భగవాన్ సాహు చెబుతున్నారు. తాము తయారు చేసిన ఆవు దూడల కన్నెలు, తాడులు సమీపంలోని సంతల్లో విక్రయిస్తే ఒక్కోటి రూ.40 నుంచి రూ.50 పలుకుతుందని తెలిపారు. చేతి కష్టం ఎక్కువ ఉండే తమ పనిలో ఆదాయం అంతంతమాత్రమేనన్నారు. ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందిస్తే, పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి, అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందన్నారు. బ్యాంకు రుణాలు ఇప్పించి, ఆదుకుంటే మరిన్ని కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.


గ్రామాల్లో కన్నెలు అమ్ముతున్న తలతంపరకు చెందిన తరిణీసేన్

ఈ పని బాగుంది..



సిమెంట్ సంచుల నుంచి దారాలను తీస్తూ, ఆదాయం పొందుతున్నా. 30 ఏళ్లకు పైబడి ఈ పని చేసి, వచ్చిన ఆదాయంతో కుటుంబానికి తోడుగా ఉంటున్నా. ఈ పని బాగుంది. రోజుకి 60 నుంచి 70 సంచుల నుంచి దారాలు సేకరిస్తా. ఖాళీగా ఉన్నప్పుడు పని చేసుకుంటున్నా.

-కమల బిసాయి, కొక్కిలిపుట్టుగ

30 ఏళ్లుగా ఈ పని చేస్తున్నాం..

30 ఏళ్లుగా సిమెంట్ సంచుల నుంచి సేకరించిన దారాలతో తాళ్ల తయారు చేస్తున్నాం, ఎక్కడికో వెళ్లి పనులు వెతుక్కోవడం కంటే ఊరిలోనే ఉంటూ ఉపాధి కల్పించుకున్నాం. మాలాగే మరో 60, 70 కుటుంబాలు ఈ పనే చేస్తున్నాయి. ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుంది.

-గుణో సాహు, పెద్ద ఆమదాలపుట్టుగ


ఆదివారం సంతలో కన్నెలు, ఉట్టిలు, తాళ్లు అమ్ముతున్న దృశ్యం

- ఏడు దశాబ్దాల కిందట ఏర్పాటు
- ఎంపీ నిధులతో పునర్నిర్మాణం

ఎర్రన్న చదివిన గ్రంథాలయం



గారలో ఎంపీ నిధులతో నిర్మించిన గ్రంథాలయం

గార, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు. గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి ఎంతో మంది ఉన్నత స్థాయికి చేరుకున్నారు. జిల్లాలోని ప్రాచీన లైబ్రరీల్లో గార శాఖా గ్రంథాలయం ఒకటి. సుమారు ఏడు దశాబ్దాల కిందట 1955లో ప్రభుత్వం ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. దివంగత నేత.. కేంద్రమాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఒకప్పుడు ఈ గ్రంథాలయం పాఠకుడే. కొన్నేళ్ల తర్వాత ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. కేంద్రమంత్రి హోదాలో ఎర్రన్నాయుడు రూ. లక్ష నిధులు మంజూరు చేయగా భవనాన్ని పునర్నిర్మించారు. మరికొన్నేళ్లకు ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఎర్రన్న కుమారుడు.. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు 2018లో రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. 2019లో ఈ నిధులతో విశాలమైన భవనాన్ని పునర్నిర్మించి ప్రారంభించారు. దేశ నాయకులు, జాతీయ నాయకుల చరిత్రలు, పురాణాలు, చారిత్రక గ్రంథాలు ఇక్కడ భద్రపరిచారు. ప్రస్తుతం గార గ్రంథాలయంలో సుమారు 4,700 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. దాదాపు 800 మంది పాఠకులు సభ్యత్వం పొందారు. ఆర్ఆర్‌బీ, పోస్టల్, డీఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్, బ్యాంకు పరీక్షలు తదితర వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ సరఫరా చేసింది. ప్రస్తుతం చాలా మంది యువత ఇక్కడ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

● ఇదిలా ఉండగా గ్రంథాలయానికి కొంతమేర నిధుల సమస్య వెంటాడుతోంది. జూన్ నుంచి విద్యుత్, నీరు, పేపర్ తదితర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామ పంచాయతీల నుంచి రావాల్సిన 8 శాతం సెస్.. కూడా గ్రంథాలయానికి పూర్తిస్థాయిలో జమకావడం లేదు. నిధుల సమస్యను పరిష్కరించి.. గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని పాఠకులు కోరుతున్నారు.

● ఎర్రన్నాయుడు తన తాతగారి ఊరైన బోరవానిపేటలో ఉంటూ 8 నుంచి 10వ తరగతి(1968-1971) వరకూ గార జడ్పీ ఉన్నత పాఠశాలలోనే చదివారు. బోరవానిపేట నుంచి సుమారు 2 కిలోమీటర్లు కాలినడకన ప్రతి రోజూ హైస్కూల్‌కు వెళ్లేవారని ఆయన బంధువు, విశ్రాంత ఎంఈవో బోర వాసుదేవరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆ సమయంలో ఎర్రన్నాయుడు తరుచూ ఈ లైబ్రరీని సందర్శించి పుస్తకాలు చదివేవారని వివరించారు. ఎర్రన్నకు పుస్తక పఠనం అంటే ఎంతో ఆసక్తి అని తెలిపారు. ఎర్రన్నాయుడుతోపాటు అరంగిపేటకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వజ్జ విశ్వేశ్వరరావు కూడా ఈ గ్రంథాలయంలో పుస్తకాలు చదివేవారని వివరించారు.

చారిత్రక పుస్తకాలు చదవుతాను



ఈ గ్రంథాలయంలో ఎన్నో పుస్తకాలు అందుబాటులో ఉన్నా యి. దినపత్రిక, చారిత్రక పుస్త కాలు చదువుతుంటాను. ప్రస్తుత యువతకు ఈ గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతోంది.

-గార కుమారస్వామి, విశ్రాంత ఉద్యోగి

అదృష్టంగా భావిస్తున్నా..



చరిత్ర గల ఈ గ్రంథాలయంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇక్కడ పాఠకులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఎక్కువ మంది యువతతో పాటు పెద్దలు కూడా ఇక్కడకు వచ్చి పుస్తకాలు చదువుతుంటారు.

-ఎస్.రామకృష్ణ, లైబ్రేరియన్, గార

అసెంబ్లీలో ఎమ్మెల్యేల గళం




అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు గౌతు శిరీష, మామిడి గోవిందరావు, కూన రవికుమార్

అసభ్య పోస్టులు పెడుతున్న వారిని జగన్ వత్తాసు..

● ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియా వేదికగా అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న వారికి వైసీపీ అధ్యక్షుడు జగన్ వత్తాసు పలుకుతున్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆరోపించారు. శనివారం అసెంబ్లీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సోషల్‌మీడియా పోస్టులపై స్వయంగా ఫిర్యాదు చేసినా పోలీసుల నుంచి సహకారం ఉండడం లేదని గుర్తు చేశారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారికి 41 ఏ నోటీసులు ఇచ్చి విచారించి విడిచి పెడుతున్నారని, ఈ కారణంగా వారు మరింతగా రెచ్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్న వారికి వత్తాసు పలకడంతో పాటు జిల్లాకు ఇన్‌చార్జిలను నియమించి వారిని కాపాడే ప్రయత్నం చేయడం విచారకరమని అన్నారు. మన అనుమతులు లేకుండా ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చి శిక్షించాలని శిరీష డిమాండ్ చేశారు.

పాతపట్నంలో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలి..

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పాతపట్నలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలను నెలకొల్పాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో భాగంగా శనివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలనే ఏకరవు పెట్టారు. పారిశ్రామికంగా పురోగతి సాధించేందుకు సాంకేతికవిద్య అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందన్నారు.

ఆ బిల్లులు ఎప్పుడు ఇస్తారు..

● ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో శనివారం ఎమ్మెల్యే కూన రవికుమార్ పీఎంఏవై గృహ నిర్మాణాలపై ప్రశ్నలు వేశారు. గతంలో నిర్మించిన పట్టణ గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెల్లించాల్సిన బిల్లులపై మున్సిపల్ మంత్రి సమాధానం ఇవ్వాలని కోరారు. అలాగే శాసనసభ జీరో అవర్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధించి కూన రవికుమార్ ప్రస్తావనకు వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానం ఇస్తూ అసెంబ్లీ రికార్డుల్లో ప్రతి ఒకటి నమోదు అవుతుందని, దాన్నిబట్టి సభ్యుల అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తారని తెలిపారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు స్పందిస్తూ అసెంబ్లీలో రికార్డుతో మంత్రులకు సంబంధం లేదని, సభ్యులు అడిగిన ప్రశ్నలను మంత్రులు కూడా నమోదు చేసుకుని తదుపరి చర్యలు సమాధానం తెలియజేయాలని ప్రకటించారు.

మినీ సెంటర్లను.. ప్రధాన కేంద్రాలుగా మార్చాలి

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లోని మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు అందజేస్తున్న సిబ్బందిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'జిల్లాలో 599 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో సిబ్బందికి పనిభారం తప్ప.. వేతనాలు పెరగడం లేదు. యాప్‌లు, రికార్డుల రూపంలో అదనపు భారం పడుతోంది. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్ తదితర రాష్ట్రాల మాదిరి.. ఇక్కడ కూడా మినీ సెంటర్లను ప్రధాన కేంద్రాలుగా మార్చాలి. 42 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన మినిట్స్ కాపీ అమలు చేయాలి' అని వారు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా నాయకులు పి.లతాదేవి, కె.సుజాత, కె.లక్ష్మీ, భూలక్ష్మి, కె.మాధవి, కె.హేమలత, జె.కాంచన, నూకమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

చూస్తుండగానే..

(ఐదో పేజీ తరువాయి)

స్థలాన్ని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించామన్నారు.

● **వినోద్... అదష్టవంతుడు**

వారిద్దరూ బావిలో దిగి ఎంతసేపయినా రాకపోవడంతో అక్కడే ఉన్న డిల్లేశ్వరరావు సోదరుడు వినోద్ కూడా బావిలో దిగేందుకు ప్రయత్నించాడు. కానీ అప్పటికే వారిద్దరూ నీటిలో మునిగిపోవడంతో.. బావిలో దిగొద్దని కుటుంబ సభ్యులు వారించారు. దీంతో వినోద్ వెనక్కి తగ్గాడు. లేదంటే వినోద్ కూడా మృతి చెందేవాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వినోద్ అదృష్టవంతుడని స్థానికులు పేర్కొన్నారు.

● **కనిమెట్టలో విషాదఛాయలు..**

కనిమెట్టలో ఒకేసారి ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. మధుసూదనరావుకు భార్య సరస్వతి, కుమారుడు జగదీశ్వరరావు ఉన్నారు. కుమార్తె తిరుమలకు కొన్నాళ్ల కిందట వివాహం చేసేశారు. వ్యవసాయ పనులు చేస్తూ.. మధుసూదనరావు జీవనం సాగిస్తున్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

● డిల్లేశ్వరరావు.. మధుసూదనరావు మేనల్లుడే. ఐటీఐ పాసై ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ప్రయోజకుడవుతాడనుకున్న తమ కుమారుడు అర్థాంతరంగా మృతి చెందడంతో తల్లిదండ్రులు కింతలి చౌదరి, రాజేశ్వరి కన్నీరుమున్నీరుగా రోదించారు.


మృతదేహాలను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

కలిసొచ్చిన ఖరీఫ్

(ఐదో పేజీ తరువాయి)

డిసెంబరు 31లోగా క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ సిబ్బంది ఈ-క్రాప్ చేసిన పంటలకు మాత్రమే ఇన్సూరెన్స్ చేసేందుకు అవకాశం కల్పించారు.

● ఈ సీజన్‌లో రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన వారు, అలాగే సీఎస్సీ, ప్రధానమంత్రి ఫసల్‌భీయా యోజన పోర్టల్ ద్వారా ఆధార్‌కార్డు, 1బీ, అడంగళ్ వంటి ధ్రువీకరణ పత్రాలతో పాటు ఫోన్‌నెంబరు, బ్యాంకుఖాతా నెంబరుతో నమోదు చేసుకోవాలి. కౌలురైతులు తమ సీసీఆర్‌సీ కార్డుల వివరాలు, పంట ధ్రువీకరణ, ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు, బ్యాంకుఖాతా నెంబరుతో సచివాలయ పరిధిలో గానీ, పోస్టాఫీస్‌లో గానీ, నేషనల్ క్రాఫ్ ఇన్సూరెన్స్ పోర్టల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చు. తుఫాన్లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు వలన పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం కింద ఈ బీమా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించాయి.

నేడు గార మండల సమావేశం

గార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఆదివా రం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఇసుక వాహనాల పట్టివేత

ఎచ్చెర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు లారీలు, రెండు ట్రాక్టర్లు, రెండు ఎక్స్‌కవేటర్లను తమ్మి నాయుడుపేట పంచాయతీ ననపలవానిపేట వద్ద శనివారం పట్టుకున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

సరుబుజ్జిలి,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని సీఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. శనివారం షలంత్రి గ్రామంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు యూని యన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఏటీఎం పిన్, అకౌంట్ నెంబర్లు అడిగితే ఇవ్వరాదని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ స్వరూపా రాణి, అగ్రికల్చర్ అసిస్టెంట్ లావణ్య, మహిళా పోలీస్ రోజా, పాల్గొన్నారు.

'జగన్ ఆశయాలను నెరవేరుస్తా'

సరుబుజ్జిలి,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలను నెరవేరుస్తానని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాలసత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ తనకు అప్పగించిన రాష్ట్ర కార్యదర్శి పదవికి పూర్తిస్థాయిలో వన్నె తెస్తానని తెలిపారు.

సైబర్ నేరాల్లో గోల్డెన్ అవర్ చాలా కీలకం

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళంక్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల సమయంలో గోల్డెన్ అవర్ చాలా కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో బ్యాంకు అధికారులు, కోఆర్డినేటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బ్యాంకుల వద్ద భద్రతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. ఏటీఎంల వద్ద నిరంతరం సెక్యూరిటీ గార్డులు, సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరం జరిగినప్పుడు గోల్డెన్ అవర్‌లో బ్యాంకు అధికారులు సత్వరమే స్పందించి సంబంధిత అకౌంట్లను ఫ్రీజ్ చేయాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులకు బ్యాంకు అధికారులు సహకరించాలన్నారు. బాధితులు హెల్ప్‌లైన్ నెంబర్ 1930, సైబర్‌క్రైమ్.జీవోవి.ఇన్‌కు ఫిర్యాదు చేసేలా చూడాలన్నారు. ఈసమావేశంలో డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, అప్పారావు, రాజశేఖర్, ప్రసాదరావు, సీఐలు ఇమాన్యుయల్ రాజు, పైడపునాయుడు, ఈశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

అరాట్టు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): బలగలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అరాట్టు బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా అయ్యప్పకు పంచామృ తాలు, పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 25 వరకు నిర్వహిస్తామని అర్చకులు దేవరకొండ శంకర్ నారాయణ శర్మ తెలిపారు.

వేంకటేశ్వరునికి లక్ష తులసి దళార్చన

నగరంలోని చిన్నబజార్ వేంకటేశ్వర ఆలయంలో శనివారం స్వామివారికి లక్ష తులసిదళార్చన నిర్వహించారు. స్వామిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.



ఉత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం

రైల్వే హెచ్‌టీ తీగలను పట్టుకున్న మతిస్థిమితం లేని వ్యక్తి

- తీవ్రంగా గాయపడిన వైనం
- వైద్యానికి నిరాకరణ

సోంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొర్లాం వద్ద బారువ రైలు నిలయంలో శనివారం ఆగిఉన్న గూడ్స్ రైలు పైకి మతిస్థిమితం లేని వ్యక్తి ఎక్కి హైటెన్షన్ విద్యుత్ తీగలను పట్టుకున్నాడు. దీంతో షాక్‌కు గురై తీవ్ర గాయాలయ్యాయి. అది చూసిన స్థానికులు సహాయం చేసేందుకు ప్రయత్నించగా వారిపై దాడికి దిగాడు. దీంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అతనికి చికిత్స చేసేందుకు ప్రయత్నించగా అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాలను ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు.

బాలికలను మానసికంగా బలోపేతం చేయాలి

అరసవల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికలను మానసికంగా బలోపేతం చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతీ బాలిక రక్తహీనతకు గురికా కుండా బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. మండల, గ్రామస్థాయిలో కౌమార బాలికలను గుర్తించి, వారిని బృందాలగా చేసి వివిధ అంశాలపై అవగాహన, శిక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.లిల్లీ, ఎన్‌జీవో శ్రీనివాస్, ప్రసాద్, జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్స్ కేవీ రమణ, ఎస్.నీరజ, టి.సుజాత, 30 మండలాల మెడికల్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

నేటితో ముగియనున్న క్రీడా పోటీలు

ఎచ్చెర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో మూడు రోజుల నుంచి జరుగుతున్న జోన్-1 బాలికల క్రీడా పోటీలు ఆదివారం ముగియనున్నాయి. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాల్లోని 21 గురుకులాల నుంచి సుమారు 800 మంది విద్యార్థినులు పాల్గొంటున్నారు. మూడో రోజు శనివారం జరిగిన పోటీల్లో అథ్లెటిక్స్ 100 మీటర్ల జూనియర్ విభాగంలో వై.జ్యోత్స్న (వియ్యంపేట) గోల్డ్, ఎ.జీవనప్రియ (భామిని) సిల్వర్, వి.వెంకటలక్ష్మి (కోనాం) కాంస్యం, సీనియర్ విభాగంలో ఎస్.శృతి (నర్సీపట్నం) గోల్డ్, ఎ.లక్ష్మి (గరుగుబెల్లి) సిల్వర్, కె.శ్రావ్య (వియ్యంపేట) కాంస్యం గెలుపొందారు. డిస్కస్‌త్రో జూనియర్స్‌లో కె.దీక్షిత (నెల్లిమర్ల) గోల్డ్, ఎ.ధనలక్ష్మి (వియ్యంపేట) సిల్వర్, సీహెచ్.కృష్ణవేణి (వేపాడ) కాంస్యం సాధించారు.

మీడియాకు సామాజిక ప్రయోజనాలు ముఖ్యం

ఎచ్చెర్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సామాజిక ప్రయోజనాలే లక్ష్యంగా మీడియా వ్యవహరించాలని అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని హితవు పలికారు. వర్సిటీలో జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ పత్రికా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కల్పిత కథనాలు, అసత్య ప్రచారాలు, అర్థ సత్య రాతలకు ప్రాధాన్యం ఇవ్వరాదని అన్నారు. సీనియర్ పాత్రికేయుడు జంధ్యాల శరత్‌బాబు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్ట్ మారాలని, అదే సమయంలో విలువలకు, వృత్తి ధర్మానికి తిలోదకాలివ్వరాదని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు, నామ విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు, వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, జర్నలిజం విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.తిరుపతిరావు, డాక్టర్ జి.లీలావరప్రసాదరావు, డాక్టర్ వైడీ రామదాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వర్సిటీ వీసీ రజని

బూరగాంలో పత్రికా దినోత్సవం

కంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య దేశంలో దినపత్రికలు ముఖ్యపాత్రను పోషిస్తున్నాయని బూరగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వరరావు అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం పాఠశాలలో పత్రికల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలినడకన అరసవల్లికి అయ్యప్ప స్వాములు

రణస్థలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారువాకు చెందిన నిద్రబంగి రామకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో 28 మంది అయ్యప్ప స్వాములు, ఐదుగురు భవాని భక్తులు శనివారం కాలి నడకన అరసవల్లికి బయలు దేరారు. ఆదివారం మధ్యాహ్నం అరసవల్లి చేరుకుని సూర్యనారాయణ స్వామిని దర్శించుకుంటామని వారు తెలిపారు.



నారువా గ్రామం నుంచి బయలుదేరిన అయ్యప్ప మాలధారులు

ఏఐఐఎంఎస్‌లో రణస్థలం విద్యార్థినికి ర్యాంకు



తల్లిదండ్రులతో శృతి

రణస్థలం,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండి యా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు సంబం ధించిన ఫలితాలు (ఏఐఐఎంఎస్) శనివారం విడు దలయ్యాయి. ఈ ఫలితా ల్లో రణస్థలం మండల కేంద్రానికి చెందిన కిల్లాన శృతి 821వ ర్యాంకు సాధించింది. ఈమె ఆంధ్ర మెడికల్ కళాశాల (ఏఎంసీ)లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఎండీగా గైనికాలజిస్టు పూర్తి చేసి ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపింది. ఈమె తండ్రి కిల్లాన హేమసుందరరావు జేఆర్‌పురం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి నిర్మల గృహిణి.

బీజేపీ బలోపేతానికి కృషి

జి.సిగడాం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం అన్నారు. శనివారం జి.సిగడాంలో ఏర్పాటు చేసిన క్రియాశీలక సభ్యత్వ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల, గ్రామ స్థాయిల్లో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కేంద్ర పథకాలు అర్హులకు చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా, మండల నాయకులు సంపత్‌రావు నాగేశ్వరరావు, పీవీ రత్నకుమారి, వజ్జపర్తి రఘురాం, మీసాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి చేతికి అరుదైన శస్త్రచికిత్స

అరసవల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరానికి చెందిన 19 ఏళ్ల కార్తీక్ అనే యువకుడి చేతిపై అద్దం పడడంతో రక్తనాళం తెగిపోయింది. దీంతో రక్త ప్రసరణ ఆగిపోయి, చేయి చల్లగా, నీలిరంగులోకి మారిపోయింది. యువకుడిని కుటుంబ సభ్యులు గ్లోబల్ న్యూరోకేర్ ఆసుపత్రికి తీసుకుని వచ్చారు. వైద్యులు బొడ్డేపల్లి యోగేష్, దుంగ శ్వేత, గొనప భవాని ఆధ్వ ర్యంలో సుమారు నాలుగున్నర గంటల పాటు చేతికి శస్త్ర చికిత్స నిర్వహించారు. సమయం వృథా చేయకుండా వెంటనే సర్జరీ చే యడంతో కార్తీక్ చేతిని రక్షించగలిగామని, ఆపరేషన్‌కి కావలసిన అన్ని వసతులు ఇప్పుడు గ్లోబల్ న్యూరోకేర్ ఆసుపత్రిలో ఉన్నా యని హాస్పిటల్ అధినేత డాక్టర్ గౌతమ్ తెలిపారు.



కార్తీక్‌తో వైద్య బృందం

డొంకూరు వీవోఏ తొలగింపు

ఇచ్ఛాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డొంకూరు వీవోఏ చిక్కాల వరలక్ష్మిని విధుల నుంచి తొలగించినట్లు ఏపీఎం ప్రసాద్ తెలిపారు. వీవోఏ వరలక్ష్మి సరిగా పనిచేయడం లేదని కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు శనివారం డొంకూరులో మత్స్య మహిళా గ్రామ సంఘాలతో ఏపీఎం సమా వేశం నిర్వహించారు. 42 సంఘాలకు గాను 40 సంఘాలు వరలక్ష్మి పనితీరు బాగోలేదని, సభ్యులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని చెప్పాయి. దీంతో వరలక్ష్మిని తొలగించి కొత్త వీవోఏ ఎంపికకు సంఘ సభ్యులు తీర్మానం చేశారు.

వృశ్చిక సంక్రమాణం పూజలు

ఇచ్ఛాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో వృశ్చిక సంక్రమాణం పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి సింధూర మర్దన, పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



స్వేచ్ఛావతికి పూజలు చేస్తున్న దృశ్యం

పన్ను బకాయి చెల్లించని భవనానికి తాళం

శ్రీకాకుళంక్రైం, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామకృష్ణ థియేటర్ సందులో ఉన్న ఓ వాణిజ్య భవనానికి సంబంధించి రెండున్నరేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించడం లేదు. రూ.7.30లక్షల బకాయిలు ఉండటంతో భవన యజమానికి ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా స్పందన లేకపోవ డంతో ఆ భవనం లోని రెండో అంత స్తుకు తాళం వేసి సీజ్ చేశారు. నగర పాలక ఆర్ఐ ఉ మామహేశ్వరరావు, సిబ్బంది నరేష్, వార్డ్ అడ్మిన్ సంజయ్, నాయుడు పాల్గొన్నారు.

అంతర పంటలతో రైతులకు ఆదాయం

కంచిలి/కవిటి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిలో అంతర పంటల సాగు ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఆమదాలవలస కృషివిజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డా.అనూష అన్నారు. కంచిలి మండలం కత్తివరం, కవిటి మండలం బల్లిపుట్టుగలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కొబ్బరి పంటకు పీడిస్తున్న సర్పిలాకార తెల్లదోమ, నల్లముద్ది, ఎర్రముక్కు పురుగుల లక్షణాలు, జీవనియంత్రణ చర్యలు, రసాయన చర్యల యాజమాన్యం గూర్చి రైతులకు ఆమె వివరించారు. కార్యక్రమంలో సోంపేట వ్యవసాయ శాఖ ఏడీఏ జగన్మోన్‌రావు, ఉద్యానశాఖాధికారి మాధవీలత, ఏవోలు దుర్గాప్రసాద్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కాలినడకన వంతెన పనులు ప్రారంభం

కంచిలి/కవిటి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాడుపూడి రైల్వే నిలయం సమీపంలోని బసవపుట్టుగ, బసవకొత్తూరు గ్రామాల సమీపంలో రైల్వే కాలినడక వంతెన పనులను ఐవోడబ్ల్యూ ఎస్ఎన్ పండా శనివారం ప్రారంభించారు. నిధుల మంజూరుకు కృషిచేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు రుణపడి ఉంటామని రైల్వే జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాస రౌళో అన్నారు.



వంతెన పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మల్లికార్జునుడికి ధరాపాత్ర విరాళం

ఇచ్ఛాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి ఉపాలయానికి పట్టణానికి చెందిన భక్తుడు పెద్దబాబు 4 కేజీల వెండితో తయారు చేసిన ధరాపాత్రను శనివారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చనిపోయిన రెండు నెలల తరువాత..

- పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం
- అన్న మృతిపై తమ్ముడి అనుమానం



మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆ వ్యక్తి చనిపోయి రెండు నెలలు అయింది. అయితే, తన అన్న మృతిపై తనకు అనుమానాలు ఉన్నాయని తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన రూరల్ మండలం గూడేంలో శనివారం చేసుకుంది. గూడేం గ్రామానికి చెందిన బొంతల కరువోడు(79) ఈ ఏడాది సెప్టెంబరు 18వ తేదీ వేకువ జామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువుకివెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా చెరువులో మృతదేహం లభ్యమైంది. దీంతో అప్పుడే కుటుంబసభ్యులు,గ్రామస్థుల సమక్షంలో కరువోడు మృతదేహాన్ని పూడ్చివేశారు. కరువోడు భార్య ఐదేళ్ల కిందట చనిపోయింది. కరువోడు తమ్ముడు ఏకయ్య చాలాకాలం కిందట శ్యామపాలెంలో స్థిరపడిపోయాడు. దీంతో కరువోడు తన భార్య చెల్లెల కూతురి వద్ద ఉండేవాడు. అయితే, కరువోడు చనిపోయిన రెండు నెలల తరువాత, తన అన్న మృతిపై అనుమానం ఉందని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని ఆయన తమ్ముడు ఏకయ్య పోలీసులకు శుక్రవారం ఫిర్యాదుచేశాడు. దీంతో చెరువులో పూడ్చినకరువోడు మృతదేహాన్ని వెలికితీసి ఎమ్మార్వో గణపతిరావు సమక్షంలో రిమ్స్ వైద్యులు పోస్టుమార్టంనిర్వహించారు. కొన్ని అవశేషాలు సేకరించి మృతదేహాన్ని తిరిగిపూడ్చివేశారు. ఇదిలా ఉండగా, ఏకయ్య తన అన్న అంత్యక్రియలకు హాజరై అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నాడని, ఇప్పుడు ఆస్తి కోసమే ఫిర్యాదు చేశాడంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఈదురాపల్లిలో ఉపాధ్యాయిని ఆత్మహత్య



నవ్య(ఫైల్)

పలాస, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోగల సూదికొండకాలనీ ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న శాసనపురి నవ్య(30) శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పలాస మండలంలోని ఈదురాపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి ఎన్ని షణ్ముఖరావుతో 2020లో బ్రాహ్మణతర్లాకు చెందిన నవ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. అదే సంవత్సరంలో ఆమెకు ఉపాధ్యాయినిగా సీతాపురంబొడ్డపాడులో పోస్టింగు వచ్చింది. గత ఏడాది జూన్‌లో సూదికొండకాలనీకి బదిలీ అయింది. కాగా శనివారం ఒక్కపూటే విధులకు వస్తానని నవ్య సెలవుచీటీ ఇచ్చారు. ఈ క్రమంలో ఈదురాపల్లి అత్తవారింట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరిపోసుకున్నారు. ఆమె మృతికి కార ణాలు తెలియరాలేదు. సంఘటన స్థలాన్ని కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు పరిశీలిం చారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించా రు. కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ తెలిపారు. నవ్యకు ఏడాదిన్నర వయసు కలిగిన కుమార్తె ఉంది.

పోలీసు లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు(ఇన్‌సెట్‌లో) చిన్నారావు (ఫైల్)

ఎచ్చెర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట గ్రామానికి చెందిన మొదలవలస చిన్నారావు (35) అనే ఆర్మీ జవాను అంత్యక్రియలు శనివారం పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. 15 ఏళ్ల కిందట ఆర్మీలో చేరిన చిన్నారావు ప్రస్తుతం రాజస్థాన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన రెండు రోజుల కిందట రాజస్థాన్‌లో అకాలమరణం చెందారు. దీంతో మృతదేహాన్ని శనివారం ఉదయం స్వగ్రామానికి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, ఆర్మీ ఉద్యోగులు చిన్నారావుకు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. చిన్నారావుకు భార్య సులోచన, కుమారుడు మోక్షిత్, కుమార్తె తేజేశ్వరి ఉన్నారు.

మంచినీళ్లపేటలో ఇరువర్గాల మధ్య తోపులాట

వజ్రపుకొత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మంచినీళ్లపేటలో శనివారం టీడీపీ, వైసీపీకి చెందిన ఇరువర్గాల మధ్య వాగ్వాదం తోపులాటకు దారితీసింది. ఈ మేరకు ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు రావడంతో దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ నిహార్ చెప్పారు. గతంలో జట్టీ పనులకు వచ్చిన కూలీలకు లక్షా 50 వేలు వేతనాలు కాంట్రాక్టరు గుడాం చిన్నారావు బాకీ పడ్డాడని, ఆ మొత్తం ఇవ్వాలని కూలీలు ఆయన్ను నిలదీయగా ఇరువర్గాల మధ్య తోపులాట జరిగిందని తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

- పోలీసు, మునిసిపల్ అధికారుల నిర్ణయం



కమిషనర్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ మోహనరావు

పలాస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీసులు, మునిసిపల్ అధికారులు నిర్ణయించారు. శనివారం మునిసిపాలిటీలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడానికి పోలీసులు, మునిసిపల్ అధికారులు సంయుక్తంగా కార్యాచరణ చేశారు. ఈ మేరకు కమిషనర్ ఎన్.రామారావు అధ్యక్షతన మునిసిపల్ కార్యాలయంలో కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ డి.మోహనరావుతో సమావేశం నిర్వహించారు. కేటీరోడ్డు, పాతజాతీయరహదారి, నిత్యానందనగర్, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు ప్రాంతాల్లో నిరంతరం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని అధికారులు గుర్తించారు. రోడ్లపై ఆటోలు, ఇతర పెద్ద వాహనాలు పార్కింగ్ చేయకుండా వారికి కేటాయించిన ప్రాంతాల్లో పార్కింగ్ చేయడం, నిర్దేశించిన సమయాల్లోనే భారీవాహనాలు పట్టణంలోకి అనుమతించడంపై చర్చించారు. ఆక్రమణ తొలగింపుపై ఇబ్బందిగా ఉందని, కాశీబుగ్గ బస్టాండులో అనధికార మార్కెట్ వల్ల బస్సుల రాకపోకలతో ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కమిషనర్ డీఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. సంయుక్తంగా ఈ సమస్య పరిష్కరించాలని నిర్ణయించారు.

రామ్మూర్తినాయుడి మృతి బాధాకరం: అచ్చెన్న

కోటబొమ్మాళి,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు మృతి బాధాకరమని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిసూ తన సంతాపం తెలియజేశారు. 1994 నుంచి 99 వరకు చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆయన ఎంతగానో రాణించారని గుర్తు చేసుకున్నారు. ఈ విషాద సమయంలో యావత్ తెలుగుదేశం కుటుంబం నారా వారి కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు.

- పాతపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మృతిపై టీడీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి ప్రగాఢ సంతాపం తెలిపారు.

నిర్వహణకు నోచుకోక.. వినియోగంలో లేక

- మూగజీవాలకు అందని వైద్యసేవలు
- ఇదీ డబారు పశువైద్యకేంద్రం పరిస్థితి



నిరుపయోగంగా మారిన డబారు పశువైద్యకేంద్రం

మెళియాపుట్టి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని డబారు పశువైద్యకేంద్రం నిరుపయోగంగా మారింది. ప్రధానంగా నిర్వహణ లేకపోవడంతో వినియోగంలో లేకుండాపోయింది. కేరాశింగి, పద్ద పంచాయతీ పరిధిలో పశువులకు వైద్యం అందించాలన్న ఉద్దేశంతో 15 ఏళ్ల కిందట భవనం నిర్మించడంతోపాటు వైద్యులను నియమించారు. తర్వాత వైద్య సిబ్బంది ఖాళీ అయినా భర్తీకి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసింది. పశు వైద్య సహాయకులను (వీఏఏ) నియమించింది. ఇంతలో డబారు పశువైద్యకేంద్రం కేరాసింగిలో కలిపారు. డబారుకు రెండు కిలోమీటర్లు దూరంలో ఉండడంతో ఇక్కడ మూగజీవాలను సేవలందడంలేదు.లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డబారులోని పశువైద్య కేంద్రం భవనం నిరుపయోగంగా మారింది.దీనికితోడు సచివాలయాల్లో వీఏఏలను నియమించినా మందులు అందుబాటులోకి తీసుకు రాలేదు. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా డబారులో సిబ్బందిని నియమించి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి సమస్యలు పరిష్కరించాలి: ఎంజీఆర్



నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న మామిడి గోవిందరావు

పాతపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో సాగునీటి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈమేరకు శనివారం అమరావతిలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిశారు. నియోజకవర్గ ప్రజలు అత్యధికశాతం వ్యవసాయరంగంపైనే ఆధారపడిజీవిస్తున్నారని తెలిపారు. గతప్రభుత్వ వైఫల్యాల వల్ల ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులకు నోచుకోలేదని చెప్పారు. ఎత్తిపోతల పథకాలు మంజూరుచేయాలని కోరారు.

ఎస్‌జీహెచ్ సభ్యులకు శిక్షణ ఇవ్వాలి: పీడీ



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

నరసన్నపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్వయంశక్తి సంఘాల సభ్యులు ఆర్థికంగా మరింత స్వావలంబన సాధించేందుకు సీఆర్పీలు కీలకపాత్ర పోషించాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ సూచించారు.కేరళను ఆదర్శంగా తీసుకొని సంఘాల సభ్యులకు శిక్షణ ఇవ్వాలన్నారు.శనివారం నరసన్నపేట వెలుగు కార్యాలయంలో నరసన్నపేట బ్లాక్ పరిధిలోగల నరసన్నపేట, జలుమూరు, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్ మండలాల సీఆర్పీలు, ఏపీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయంశక్తి సంఘాల మహిళలకు వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు తగిన అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏసీ కొండలరావు, బీడీఎం మల్లేశ్వరరావు, ఏపీఎం అప్పలరామయ్య, మహిళ సమాఖ్య మండలాధ్యక్షురాలు పుచ్చల కల్పన, జిల్లా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

వజ్రపుకొత్తూరు,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ బి.నిహార్ కోరారు. శనివారం బాతుపురం ఉన్నతపాఠశాలలో సంకల్పంకార్యక్రమంలో భాగంగావిద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బల్లసుబాస్ పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ పరిశీలన

కాశీబుగ్గ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో గల క్యాంటీన్‌ను శనివారం మధ్యాహ్నం తహసీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి, ఎంపీడీవో వాసంత్ కుమార్, ఎంఈవో శ్రీనివాస్‌రావు పరిశీలించారు. భోజనం చేస్తున్న వారితో ఆహార పదార్థాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధ్యాయునికి ఆర్థిక సాయం

కోటబొమ్మాళి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2006లో పదోతరగతి చదివిన విద్యార్థులు అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు తర్ర అప్పారావుకు అండగా నిలిచారు. అప్పారావు కొద్దిరోజులుగా పెరాలసిస్ వ్యాధిలో బాధపడుతున్నాడు. మేరకు శనివారం రూ. 15 వేలు పూర్వ విద్యార్థులు తాతారావు, నీలం సురేష్, గోవింద, వై.ప్రసాద్, సింహాచలం, ఇంద్ర, బి.నారాయణ, చల్ల నారాయణ తదితరులు అందజేశారు.

జీడి పిక్క ఔనత్యాన్ని చాటుదాం

పలాస, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ ట్రేడ్ మార్క్ జీడి పిక్క ఔనత్యాన్ని కాపాడుదామని గ్రీన్‌ఆర్మీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు ప్రభుత్వ ఆసుపత్రి కూడలి వద్ద ఉన్న జీడి పిక్క బొమ్మ చుట్టూ రాజకీయనాయకులతో పాటు వివిధ సంస్థలకు చెందిన బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. జీడిపిక్క బొమ్మ కనిపించకపోవడంతోపాటు తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో గ్రీన్‌ఆర్మీఫౌండర్ బోనెల గోపాల్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు జీడి పిక్క బొమ్మ చుట్టు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్లాంలో పూరి-తిరుపతికి హాల్ట్ ఇవ్వాలి

నరసన్నపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉర్లాం రైల్వేస్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్టేషన్ సలహా కమిటీ సభ్యులు కోరారు. శనివారం ఉర్లాం రైల్వేస్టేషన్‌లో రైల్వే కమర్షియల్ అధికారి గణేష్‌తపతి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ సలహాకమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతి ప్లాట్‌ఫారంపై తాగునీటి సౌకర్యం కల్పించాలని, డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, ప్రయాణికులకు విశ్రాంతి తీసుకునే గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, పూర్తి- తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు రాజ్‌కుమార్, సీహెచ్ మల్లేసు, శ్రీనివాసరావు, భగవతి, అర్జునరావు, స్టేషన్ మాస్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



టెక్కలి: గ్రంథాలయ ఉద్యమకర్తలకు నివాళులర్పిస్తున్న పాఠకులు



పలాసరూరల్: పలాస శాఖ గ్రంథాలయంలో ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అధికారులు

పుస్తక పఠనం అలవరచుకోవాలి

- గ్రంథాలయ ఉద్యమకారుల ఘన నివాళి

విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణ, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను వక్తలు గుర్తుచేసుకున్నారు. స్వాతంత్ర ఉద్యమ కాలంలో వారు గ్రంథాలయ ఉద్యమానికి ఊపిరి పోశారని తెలిపారు.

- (ఆంధ్రజ్యోతి బృందం)

కార్యక్రమాల సమాచారం ఇవ్వాల్సిందే

- సంతబొమ్మాళి మండల సమావేశంలో నిలదీసిన సభ్యులు

సంతబొమ్మాళి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండా గ్రామస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. శనివారం ఎంపీపీ మేరుగ రాజేశ్వరి అధ్యక్షతన మండల సమావేశంజరిగింది. ఈ సందర్భంగా పంచాయతీస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు సర్పంచ్‌లు తీర్మానం ఇవ్వకుండా ఎలా మంజూరు చేస్తున్నారని, సర్పంచ్ హక్కులు కాలరాస్తున్నారని ఆర్‌హెచ్‌పురం, మేఘవరం సర్పంచ్‌లు యెన్ని మన్మథరావు, పరపటి సునీతరెడ్డిలు అధికారులను నిలదీశారు. గ్రామస్థాయిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు సమాచారం అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని పలువురు సభ్యులు హెచ్చరించారు. కార్యదర్శులు పంచాయతీ తీర్మానం నకళ్లు ఇచ్చిన మేరకు మాత్రమే పనులు మంజూరయ్యావని ఇంజనీరింగ్ అధికారి రంజిత్‌కుమార్ తెలిపారు.పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకం ద్వారా రూ.15కోట్లు, టూరిజం కింద రూ. ఏడు కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయంతి ప్రసాద్, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఏవో ఆర్.అప్పారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో భక్తుల రద్దీ



ఆలయంలోబారులుతీరిన భక్తులు

జలుమూరు, నవంబరు 16: (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో కార్తీక మూడో శనివారం పురస్కరించుకుని భక్తుల రద్దీ నెలకొంది. శ్రీముఖలింగేశ్వరస్వామిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు వేకువజాము నుంచే వంశధారనదిలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి బారులు తీరారు. ఉదయం తొమ్మిది గంటలకు జిల్లా నలుమూలలు నుండి భక్తులు శ్రీముఖలింగంచేరుకోవడంతో కిటకిటలాడింది. భక్తులకు ఇబ్బందులులేకుండా ఈవో పి.ప్రభాకరరావు ఏర్పాట్లు చేశారు.

అయ్యప్పస్వామి పడిపూజ

కోటబొమ్మాళి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం అప్పయ్యస్వామి పడిపూజ మహోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు గురుస్వామి తండుగు కృష్ణస్వామి, గురుస్వామి దూపాన వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సునరాపు కృష్ణబాబు వేద మంత్రోచ్చరణలతో పూజలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో వృశ్చిక సంక్రమణ పూజలు

పలాస రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పలాస సీతారామ ఆలయ ఆవరణలో వెలసిన జగన్నాథాలయంలో శనివారం జైజగన్నాథ్ ఒడియా బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో వృశ్చిక సంక్రమణం పురస్కరించుకొని ప్రత్యేక హోమాలు,పూజలు చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణసంఘ కార్యదర్శి బాబూరావుపండా, కైలాస్‌దాస్, కామేశ్వరపండా, అర్చకులు దాస్‌బాబు పాల్గొన్నారు.

నీలమణిదుర్గ ఆలయంలో దీపారాధన



నందిగాం నీలమణిదుర్గ ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేస్తున్న మహిళలు

నందిగాం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నందిగాం నీలమణి దుర్గ అమ్మ వారి ఆలయంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని నిర్వాహకుల ఆధ్వర్యంలో పురోహితులు ఎం.రమేష్ శర్మ పర్యవేక్షణలో శనివారం రాత్రి దీపారాధన నిర్వహించారు. పెంటూరు వేంకటేశ్వరాలయంలో విశేషపూజలు జరిపారు. కాగా నందిగాం గణేష్ కాలనీలో అభయాంజనే యస్వామి ఆలయంలో హరేరామ.. హరేకృష్ణ భక్తమండలి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. ఇక్కడ 15రోజుల పాటు మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు.

ఎయిర్‌పోర్టుకు స్థల పరిశీలన



మోట్టూరు- చీపురుపల్లి పంచాయతీ పరిధిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటేష్

వజ్రపుకొత్తూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మోట్టూరు, చీపురుపల్లి పంచాయతీ పరిధిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకోసం స్థలాన్ని శనివారం పలాస ఆర్డీవో వి.వెంకటేష్ పరిశీలించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 1383 ఎకరాల స్థలం అవసరం ఉన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనావేశారు. ఇటీవల మంచినీళ్లపేటలో జరిగిన పల్లెపండగ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జిల్లాకు ఎయిర్‌పోర్టును మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన విషయంవిదితమే. ఈమేరకు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థలం పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు.

నేడు బాలియాత్ర దీపోత్సవం

జలుమూరు, నవంబరు 16: (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించనున్న బాలియాత్ర దీపోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు సర్పంచ్ టి.సతీష్‌కుమార్ తెలిపారు. శ్రీముఖలింగానికి ఆనుకొని ఉన్న వంశధారనది తీర్థ ఘట్టాలు రేవులు సిద్ధం చేశామని పేర్కొన్నారు.

నేడు మండల సమావేశం

మెళియాపుట్టి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. ఎంపీపీ రాన ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హిరమండలం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): హిరమండలం, సుభలయ, నౌగూడ గ్రామాలకు ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జి.శంకరరావు చెప్పారు. హిరమండలం టౌన్ ఫీడర్ పరిధిలో స్తంభాలు, ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

22న పినకాన వర్ధంతి

టెక్కలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతు నాయకుడు కామ్రేడ్ పినకాన కృష్ణమూర్తి ఎనిమిదో వర్ధంతి ఈనెల 22న చిన్నలక్ష్మీపురం స్థూపం జంక్షన్ వద్ద నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, మోహనరావు తెలిపారు. టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ నిర్వహించే కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఫిబ్రవరి ఆరు నుంచి ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

కాశీబుగ్గ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6,7,8,9 తేదీల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు చాపర సుందర్‌లాల్ తెలిపారు.శనివారం కాశీబుగ్గ సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటరమణ, యుగంధర్, వాసుదేవు, శ్రీనివాసరావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

భూసార పరీక్ష పత్రాల పంపిణీ

కోటబొమ్మాళి,నవంబరు16(ఆంధ్రజ్యోతి): నిమ్మాడ రైతు సేవా కేంద్రంలో టెక్కలి వ్యవసాయ సంచాలకులు బీవీ తిరుమలరావు ఆధ్వర్యంలో రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను రైతులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరి వరప్రసాద్, ఏవో ఎస్.గోవిందరావు, వీఏఏ శివకుమార్ పాల్గొన్నారు.

ఎంఈవో-1ను నియమించాలి

పాతపట్నం నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఖాళీగాఉన్న ఎంఈవో-1 పోస్టు ఖాళీగా ఉండడంతో నియమించాలని యూటీఎఫ్ మండలాధ్యక్షుడు పడ్డ మోహనరావు ప్రధాన కార్యదర్శి గేదెల కవీశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ఎంఈవో-1 పదవీవిరమణ తర్వాత ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో ఉండి పోతున్నాయని తెలిపారు.

వన్‌స్టాప్‌పై అవగాహన

జలుమూరు నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని లింగాలవలస ఉన్నతపాఠశాలలో శనివారం వన్ స్టాప్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సెంటల్ అడ్మినిస్ట్రేటర్ వై.హిమబిందు సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు , గృహహింసపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేస్ వర్కరు బి.కవిత, హెచ్ఎం ఉంగటి అప్పలసూర్యనారాయణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమణమూర్తి, విశ్వనాధం, దమయంతి పాల్గొన్నారు.

ప్రగతి ప్రణాళికలపై శిక్షణ

నరసన్నపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధికి సర్పంచ్, ఎంపీటీసీలు మరింత భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో బి.మధుసూదనరావు సూచించారు. శనివారం నరసన్నపేటలో ప్రగతి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం నిధులను ప్రాధాన్యతాక్రమంలో పనులు చేయాలన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళీ, సర్పంచ్‌లు వాన గోవిందరావు, పోలాకి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

స్కూల్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్లకు..

కొత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొత్తూరులో స్కూల్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్లకు శిక్షణ నిర్వహించారు. కార్య క్రమంలో టీడీపీ నాయకుడు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 108 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు మరిచిపోయిందని విమర్శించారు.



అధ్వానంగాఉన్న కొత్తవలస రోడ్డు

రోడ్లు లేవు.. తాగు నీరు లేదు

ఇదీ బూర్జ మండలంలోని 13 గిరిజన గ్రామాల్లో పరిస్థితి

ఆమదాలవలస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బూర్జ మండలంలోని 13 గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. ప్రధానంగా రోడ్లు, తాగునీరు వంటి వసతులు లేవు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా ఇబ్బందులు తప్పడంలేదని గిరిజనులు వాపోతున్నారు. రహదారులు, తాగునీటి వసతి కోసం గిరిజనులు పలుసార్లు ఆందోళనలు నిర్వహించడంతోపాటు గ్రీవెన్స్‌లో కూడా వినతిప త్రాలు అందజేసిన విషయం విదితమే. బూర్జ మండలంలోని 13 గిరిజన గ్రామాలు సీతంపేట ఐటీడీఏ పరిధి లో ఉన్నాయి. అడ్డూరిపేట, గోపీదేవిపేట, జంగాలపాడు, బొడ్లపాడు, బొరగావలస, మర్రిపాడు,మశానపుట్టి, హరిపురం పల్లాపురం, కొత్తవలస, బొమ్మిక గ్రామాల్లో సుమారు రెండు వేల మంది గిరిజనులు నివసిస్తున్నారు. వీటి పరిధిలో పెద్దపేట, హరిపురం, వైకుం ఠపురం గ్రామ సచివాలయాల ద్వారా సేవలందిస్తున్నారు.బూర్జమానుగూడ, అనంతగిరి పేట, హరిపురం పల్లాపురం గిరిజన గ్రామాలు ఎత్తయిన కొండలపై ఉన్నాయి. ఆయా గ్రామాలకు చేరుకోవడానికి గిరిజనులు నిత్యవసర సరుకులు, వైద్యంకోసం కొండ దిగడానికి అగచాట్లకు గురవుతున్నారు. ఇవన్నీ బూర్జకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అత్యవసరసమయంలో అంబులెన్స్, అగ్నిమాపక శకటం వెళ్లలేకపోతున్నాయి. డీఎంయూ వాహనం ద్వారా పంపిణీచేసే సరుకులకోసం కొండ దిగాల్సివస్తోంది. ఈనేపథ్యంలో వైసీపీ హయాంలో పలు రోడ్ల పనులకు శంకుస్థాపన చేసినా ముందుకుసాగలేదు. దీంతో ఆయా గ్రామాలకు అధ్వానంగా ఉన్న, రాళ్లుతేలిన రోడ్లపైనే చేరుకోవల్సివస్తోంది. అనంతగిరి, బూర్జమానుగూడ మార్గంలో రహదారిపై రాళ్లు తేలడం, డొంకలు రోడ్డుపైకి రావడంతో దారి కనిపించడంలేదని పలువురు వాపోతున్నారు. కాగా అన్ని గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయని ట్రైబల్, ఆర్అండ్‌బీ జేఈ నాగభూషణం తెలిపారు.త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.